క్లుప్తంగా

ఘనంగా అన్నసమారాధన



సామర్లకోటలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వరి తదితరులు

సామర్లకోట: స్థానిక 15వ వార్డులో ఉగాది ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం అన్నస మారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు బడుగు ప్రసాద్, కర్రి రామకృష్ణ, కర్రి ఉమామహేశ్వరరావు, ఎలిశెట్టి శివాజీ, దన్నెన రాజేష్, దన్నెన దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణసాయి

సామర్లకోట: వేట్లపాలెంలో ఆదివారం రామకృష్ణ పరమహంస ధ్యాన మందిరంలో 10వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్సు పరీక్షపై అవగాహన కల్పించారు. రేవతి సైంటిఫిక్ ఫౌండేషన్, రామచంద్రపురం అధ్యక్షుడు కృష్ణ సాయి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ బుదా శ్రీనివాసు పలు అంశాలు వివరించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలో చాప్టర్ల వారీగా చదివే అంశాలపై అవగాహన కల్పించారు. వేట్లపాలెం, జి.మేడపాడు, కొత్తూరు, చినబ్రహ్మదేవం గ్రామాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. రామకృష్ణ పరమహంస ధ్యాన మందిరం అధ్యక్షుడు కంటిపూడి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కందుల సత్యనారాయణ, ఎన్వీ రమణ, పాలచర్ల సత్యనారాయణలు ఉపాధ్యాయులు కృష్ణసాయి, శ్రీనివాస్‌లను సత్కరించారు. అనంతరం పరీక్షలు రాసే విద్యార్థులకు ధ్యాన మందిరం ఆధ్వర్యంలో అట్టలు, పెన్నులు అందజేశారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



గోర్సలో వేంచేసిన సీతారామ లక్ష్మణులు

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో సీతారాముల ఆలయాలకు రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొమరగిరి, గొర్స, మూలపేట, ఉప్పాడ, కొండెవరం, పొన్నాడ గ్రామాల్లోని రామాలయాలను విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

ఉచిత గీతాజ్ఞాన, ధ్యాన శిక్షణ

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉచిత గీతా జ్ఞాన, ధ్యాన శిక్షణను ప్రారంభించారు. వీవీఎస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపన్యాసకులు డి.సూర్యరత్నం, బసవరాజు మాట్లాడుతూ గీతా జ్ఞాన, ధ్యాన శిక్షణ ద్వారా క్రమపద్ధతిలో జ్ఞానసాధన చేయడం వలన మన శరీరంలోని పలు మార్పులు జరుగుతాయన్నారు. వ్యక్తి ఆరోగ్యానికి, మానశిక వికాశానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మానసిక ఒత్తిడి తగ్గుతుందని, శక్తి సామర్థ్యాలు పెరిగి ఆలోచనా విధానంలో మార్పులు వస్తాయని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై రామలింగేశ్వరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని రమణక్కపేటకు చెందిన పులపకూర సుబ్రహ్మణ్యం (23) ఈ నెల 20వ తేదీ రాత్రి కోనపాపపేట నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా మార్గం మధ్యలో నక్క అడ్డురావడంతో ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యాన్ని స్థానికులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె.. కావాలి స్వచ్ఛమల్లె

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో మేలు
- స్వచ్ఛ సంకల్పంపై అధికారులకు అవగాహన
- శిక్షణ ఇస్తున్న ఉండూరు సిబ్బంది



సేంద్రియ ఎరువు తయారీపై శిక్షణ ఇస్తున్న ఉండూరు సిబ్బంది



ఉండూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

సామర్లకోట: పల్లెలు స్వచ్ఛమల్లెలు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో అది సాధ్యం.. అలాంటి గ్రామాలను తయారు చేయాలనే కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 31 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పం రెండో విడత వంద రోజుల ప్రణాళిక ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులకు స్వచ్ఛ సంకల్పంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలని నిర్ణయించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంగా అవార్డు అందుకున్న ఉండూరు యూనిట్ కాకినాడ జిల్లా నుంచి ఎంపికైంది. ఈ యూనిట్ సిబ్బంది ఆయా మండలాల నుంచి మోడల్ గ్రామాలుగా ఎంపికైన సర్పంచ్, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తుంది. సామర్లకోట మండలం అచ్చంపేట, పనసపాడు, గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరం, చేబ్రోలు, పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, చిత్రాడ, తొండంగి మండలం తొండంగి, ఏవీ నగరం, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, ఉత్తరకంచి, జగ్గంపేట మండలం గోవిందపురం, రాజపూడి గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. సోమవారం నుంచి కిర్లంపూడి మండలం బూరుగపూడి, సోమరాయనిపేట, తామరాడ, సోమవరం, సుంగరాయనిపాలెం, సింహాద్రిపురం, రాజుపాలెం, పాలెం, ముక్కోలు, కృష్ణవరం, జగపతినగరం, గోనేడ, గెద్దనాపల్లి, రామకృష్ణాపురం, వీరవరం, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, వేలంక, రామచంద్రపురం గ్రామాల్లో సిబ్బందికి శిక్షణ ప్రారంభించనున్నారు. ఆరోగ్యకర పల్లెలను తయారు చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ప్రజాప్రతినిధులు తెలియజేస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై అవగాహన పెంచుతున్నారు. తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ విధానం, విక్రయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆరోగ్యకర పంటలు



ఈ సేంద్రియ ఎరువుతో ఆరోగ్యకర పంటలు పండించవచ్చు. పొలంలోని గట్లపై పండ్ల మొక్కలు, కూరగాయల మొక్కలు వేసి వాటికి ఈ ఎరువు వేస్తున్నాం. దీంతో రుచికరమైన పండ్ల దిగుబడి వస్తుంది. ఇతర గ్రామాల నుంచి వస్తున్న వారికి తమ పంచాయతీ సిబ్బందితో పాటు వర్మీ కంపోస్టు యూనిట్‌లో పనిచేసే సిబ్బంది సేంద్రియ ఎరువు తయారీపై శిక్షణ ఇస్తున్నారు.

– కొప్పిరెడ్డి రాధాకృష్ణ, ఉప సర్పంచ్, ఉండూరు

ఏడాదిలో రూ.లక్ష ఆదాయం



సంపద తయారీ కేంద్రంలో సేంద్రియ ఎరువు విక్రయాలతో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష ఆదాయం వచ్చింది. వర్మీకం పోస్టుపై రైతుల్లో మరింత అవగాహన పెరగాలి. ఉండూరులో వర్మీకంపోస్టు యూనిట్ ఆవరణలో కొబ్బరి, మామిడి, సపోటా, జామ, బొప్పాయి మొక్కలతో పాటు పూల మొక్కలను పెంచుతున్నాం. వీటికి మా యూనిట్‌లో తయారు చేసిన ఎరువు వేస్తున్నాం. సందర్శకులకు వీటిని చూపిస్తున్నాం. ఇప్పటి వరకూ నాలుగు బ్యాచ్‌లలో ఆరు మండలాల సిబ్బందికి శిక్షణ ఇచ్చాం.

– కుమార్‌రాజా, పంచాయతీ కార్యదర్శి, ఉండూరు

ప్రతి గడపకూ సంక్షేమ వసంతం

హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



మాధవపట్నంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి గడపకూ సంక్షేమ వసంతం వచ్చిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం మాధవపట్నంలో సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యులు గుత్తుల కృష్ణార్జునరావు, మేడిశెట్టి దుర్గాదేవి ఆధ్వర్యంలో దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వివిధ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ఆయన వివరించారు. అవ్వా, తాతలను కలసి పింఛన్లు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అర్హత ఉంటే సచివాలయ సిబ్బంది పథకాలకు ఎంపిక చేస్తారని, రాజకీయ నాయకుల ప్రమేయం అవసరం లేదన్నారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, మండల పరిషత్తు వైస్ ప్రెసిడెంట్ పేర్నీడి వెంకట్రాయుడు, పార్టీ నాయకులు తోలెం లోవరాజు, ఇరుసుమళ్ల సాయి, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో అతివలకు మేలు

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



సభ్యులకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ఆర్థిక భరోసా కల్పిస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం వైఎస్సార్ ఆసరా పథకంలో సొమ్ము జమ కార్యక్రమాన్ని ఆర్‌బీ కొత్తూరులో ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా సాధికారితే ధ్యేయంగా కృషి చేస్తూ నామినేటెడ్ పోస్టుల్లో సైతం 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. గత ప్రభుత్వం మహిళలను అన్ని విధాలా దగా చేస్తే ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదుకుంటుందని అన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు వైఎస్సార్ ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. తొలుత సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నమూనా చెక్కులను దవులూరి దొరబాబు చేతుల మీదుగా అందజేశారు. వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముత్యాల రాజబ్బాయి, గోలి రామారావు, యండ్రు సత్తిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, పరిమి శ్రీను, కొత్త చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేస్తున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: వచ్చే నెల 3 నుంచి జరుగనున్న పదో తరగతి, ఇంటర్ సార్వత్రిక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఫైనల్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాంతపు తరగతుల నిర్వహణ ద్వారా విద్యార్థులు ఏడాది పాటు శిక్షణ పొందారన్నారు. చదువు మధ్యలో నిలిపివేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరమని అన్నారు. ఓపెన్ స్కూల్‌లో 110 మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందజేశారు. ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ తాళ్లూరి వైకుంఠం, ఫ్యాకల్టీలు కోడూరి సత్యశివప్రసాద్, వి.అచ్చిరెడ్డి, పి.శ్రీనివాసు, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాలమ్మ వారు



కాండ్రకోటలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాది ప్రజలు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

కోదండ రాముడికి వెండి శఠగోపం, పళ్లెం సమర్పణ



ఆలయానికి వెండి శఠగోపం, పళ్లెం సమర్పిస్తున్న దాతలు

పిఠాపురం: స్థానిక చిట్టోడి తోటలోని ఉన్న కోదండ రామాలయానికి ఆదివారం దాతలు వెండి శఠగోపం, పళ్లెం అందజేశారు. కొత్తపల్లికి చెందిన విశ్రాంత ఎంఈఓ మత్రివాడ మదన గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు నందగోపాల్, నాగమణి దంపతులు స్వామి వారికి రూ.26 వేల విలువ చేసే వెండి శఠగోపం, పళ్లెం సమర్పించారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జనార్దనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు దాకమూరు దుర్గా ప్రసాద్, కొత్తా రాంబాబు, గుండారపు సీతారాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన సత్తెమ్మ జాతర



సత్తెమ్మ జాతర ముగింపు ఉత్సవంలో దొరబాబు

సామర్లకోట: జి.మేడపాడులో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ, నాయకులు పుట్టా బుజ్జి బాబు, ఇరుసుమళ్ల సాయి పాల్గొన్నారు.

అల్పాహారం.. చదువుకు సహకారం

- తాటిపర్తిలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ
- స్పెషల్ క్లాస్‌లకు ఉత్సాహంగా హాజరవుతున్న విద్యార్థులు



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు దాతలు ఇచ్చిన స్నాక్స్



దాతలు ఇచ్చిన బొప్పాయి పండ్లు తింటున్న విద్యార్థులు

పిఠాపురం: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వసతులు కల్పించగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అదనపు తరగతుల ద్వారా రోజుకు 15 గంటల పాటు అభ్యసన, ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గంటల తరబడి చదువుకోవాల్సి రావడంతో పిల్లలు అలసి పోకుండా ఉండేందుకు గొల్లప్రోలు మండలం తాటిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామస్తులు చేయూత నందిస్తున్నారు. సాయంత్రం పాఠశాల పూర్తయిన తరువాత ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు స్థానికులు రోజుకు ఒకరు చొప్పున వివిధ రకాల అల్పాహారం, స్నాక్స్‌ను అందిస్తున్నారు. దీంతో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా చదువుకుంటున్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీసత్యరామచంద్రరావు విద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్నాక్స్ పెట్టడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు రోజుకొకరు చొప్పున స్నాక్స్ ఇవ్వడానికి ముందుకు వచ్చి గత నెల రోజులుగా పిల్లలకు పంపిణీ చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

లోటు లేకుండా చూస్తున్నారు



ప్రతిరోజూ స్కూల్ అయిపోయాక మాకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఖాళీ లేకుండా చదువుకోవాలంటే కొంచెం ఇబ్బందిగా అనిపించేది. అలా ఇబ్బంది లేకుండా ప్రతిరోజూ స్కూల్ అయ్యాక స్నాక్స్ ఇస్తున్నారు. ఆకలి తీరిపోవడంతో బాగా చదువుకుంటున్నాం.

– బత్తుల వీర గంగాధరరావు, పదో తరగతి విద్యార్థి, తాటిపర్తి హైస్కూల్

బలవర్ధక ఆహారానికే ప్రాధాన్యం



సాధారణంగా విద్యార్థులు ఇంటికి వెళ్లిన తరువాత చిరు తిళ్లు తింటారు. అదే సమయంలో పాఠశాలలో వారిని ఉంచి చదువుకోమని చెప్పినా వారి మనసు చిరు తిళ్ల వైపే ఉంటుంది. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల మనసు నిర్మలంగా ఉండాలని, ఆకలితో ఉంటే చదువుకోలేరని భావించి స్నాక్స్ ఏర్పాటు చేశాం. దానికి గ్రామస్తులు సహకారం అదించడం చాలా సంతృప్తిని కలిగించింది. విద్యార్థులు చాలా ఉల్లాసంగా చదువుకుంటున్నారు. పెట్టే స్నాక్స్‌లోనూ బలవర్ధకమైన ఆహారానికే ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు ఇష్టపడి తినే మొక్కజొన్న, బొప్పాయి, బిస్కెట్లు వంటివి ఇస్తున్నాం.

– శ్రీసత్యరామచంద్రరావు, హెచ్ఎం, తాటిపర్తి హైస్కూల్

ఎమ్మెల్యేను కలిసిన సూరిబాబు



ఎమ్మెల్యే పెండెం దొరబాబును సత్కరిస్తున్న సూరిబాబు

పిఠాపురం: ఎమ్మెల్యే పెండెం దొరబాబును ఆదివారం రాష్ట్ర రెవెన్యూ అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నియమితుడైన జ్యోతుల సూరిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. సంఘ అభివృద్ధికి కృషిచేయాలని సూరిబాబుకు ఎమ్మెల్యే సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియెట్, 6, 7, 8 ,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కేజీబీవీ ప్రత్యేక అధికారి బి.అమృతవాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరతగతిలో 40, ఇంటర్మీడియెట్ బైపీసీ 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్లు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్‌కు దిగువన ఉన్న బాలికలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి 20 వరకూ ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 84990 80847 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శంఖవరంలో..

శంఖవరం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.బాలామణి కుమారి ఆదివారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అర్హులైన బాలికలు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకూ ఏపీ కేజీబీవీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్య నమస్కారాలు నిర్వహించారు. వేద పండితులు కొంపెల్ల మూర్తి, ఆకొండి కృష్ణశర్మ, రాందాసు తదితరులు ఉదయం తొమ్మిది గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధికి గురై చెన్నైలో చికిత్స పొందుతున్న గోకవరానికి చెందిన బాలుడు పాట్నూరి అక్షయ్‌రామ్ వైద్యానికి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1996–2001 బ్యాచ్ విద్యార్థులు, ఫ్రెండ్స్ హెల్పింగ్ యూత్ సభ్యులు చేయూతనందించారు. అక్షయ్‌రామ్ పరిస్థితిపై చలించిన వారు రూ.40,700 నగదును సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆదివారం జెడ్పీ హైస్కూల్‌లో బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్యం విజయవంతమైన అక్షయ్‌రామ్ ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, ముమ్మిడివరపు భాస్కర్, అరిగెల సాంబ, కంది సూరిబాబు, నెల్లిపూడి జగదీష్, బత్తుల సతీష్, కుప్పిరెడ్డి వెంకటేష్, కృష్ణ, బాబి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

శంఖవరం: గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నేలపాటి భూషణం కుటుంబానికి నాసా స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. బాధితులకు సోమవారం నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బియ్యం, కిరాణా సరకులు, రగ్గులు, చాపలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. బాధితులను ప్రభుత్వంతో పాటు మిగతా స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందిలి గనియమ్మ, నాసా సంస్థ డైరెక్టర్ ఎస్.సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో బహుళ ప్రయోజనాలు

తుని: వయసుతో సంబంధం లేకుండా వాకింగ్ చేయడం వలన బహుళ ప్రయోజనాలు కలుగుతాయని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.భాస్కరరావు అన్నారు. స్థానిక బాడవతోట రోడ్డులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్ సమావేశం ఆదివారం ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ అధ్యక్షతన జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.శర్మ, సమన్వయకర్త ఎం.ప్రభావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ నియమ నిబంధనలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని, మహిళా సభ్యులు ఎక్కువగా పాల్గొనాలని ప్రభావతి సూచించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా తుని వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు కుందెం భాస్కరరావుకు నివాళులర్పించారు. ఏరియా ఉపాధ్యక్షుడు డీడీ నాయుడు, రీజినల్ కౌన్సిలర్ ఎస్.తాతారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా సమన్వయకర్త టి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న లారీ

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని మల్లేపల్లి శివారులో ఆగి ఉన్న హైషర్ మినీవ్యాన్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారిపై మల్లేపల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున మినీ వ్యాన్ డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు వ్యాన్‌ను రోడ్డు పక్కన నిలిపాడు. బొగ్గు లోడుతో విజయవాడ వైపు వెళుతున్న లారీ ఆగి ఉన్న వ్యాన్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో వ్యాన్ రోడ్డుపక్కన తుప్పల్లోకి దూసుకుపోగా లారీ ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.